క్లుప్తంగా

రూ.10 లక్షల విరాళం



కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు, భారతి

కొత్తూరు: మండలంలోని మహసింగి సమీపంలో ఉన్న వరహాలక్ష్మి నరసింహ స్వామి ఆలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటుకు విశాఖపట్నానికి చెందిన బెల్లాన శ్రీనివాసరావు, భారతి దంపతులు రూ.10 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం కొత్తూరులో అందజేశారు. ఆలయంలో శ్రీనివాసరావు దంపతులు వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విరాళ దాతలకు ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు గోగులు వరప్రసాద రావు నాయుడు, శెట్టి భానోజీరావు, శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని లక్ష్మన్నపేటలో రూ.3 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బి.శంకర్ ఆదివారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఉప సర్పంచ్ కృష్ణబాబు, వార్డు సభ్యుడు బోయిన సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో ప్రజా చైతన్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితల వేదిక సభ్యులు

కొత్తూరు: సాహిత్యంతోనే ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని కొత్తూరు మండల రచయితల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కుదుమ తిరుమలరావు అన్నారు. కొత్తూరులో మండల రచయితల వేదిక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మండలంలోని 15 మంది రచయితలు కలిసి రచించిన కవనం- సంకలనం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ఆపరేషన సిందూర్, భిన్నత్వంలో ఏకత్వం, సోషల్ మీడియాతోపాటు పలు అంశాలు ఉన్నాయని తిరుమలరావు అన్నారు. 15 మంది రచయితలను మండల రచయితల వేదిక సభ్యులు సత్కరించారు. వైశ్యరాజు హరినాథరాజు, రిటైర్డ్ ఎంఈఓ శ్రీనివాసరావు, రచయితలు కలమట శ్రీరాములు, జి.మన్మథరావు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాతపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా కె.శ్రీరామ్మూర్తి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నౌపడ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఇక్కడ పని చేసిన హెచ్‌సీ కె.భాస్కరరావు సారవకోట స్టేషన్‌కు, పీసీ జి.మోహన్ శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఇక్కడకు హెచ్‌సీ ఎం.శ్రీనివాసరావు (శ్రీకాకుళం రూరల్), పీసీలు కె.రమణమ్మ (సారవకోట), సి.హెచ్.గణేష్ (ఎచ్చెర్ల), కె.పరమేశ్వరరావు (శ్రీకాకుళం టు టౌన్), కె.శిమ్మారావు శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చారు. వీరికి ఎస్‌ఐ బి.లావణ్య, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

శిథిలావస్థలో వంతెన



శిథిలావస్థకు చేరుకున్న వంతెన

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామం వద్ద అలికాం-బత్తిలి రోడ్డులో హడ్డుబంగి గెడ్డపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. ఏ క్షణంలో కూలిపోతుందో అన్న భయం ప్రజల్లో వెంటాడుతోంది. ప్రమాదం జరిగితే తప్ప.. అధికారులు స్పందించరా.. అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జ్ఞానాన్ని బోధించే వారే గురువులు

శ్రీకాకుళం కల్చరల్: సన్మార్గంలో నడవాలనుకునే వారికి గురువులే దారి చూపిస్తారని పెంట వశిష్ట కార్తికేయశర్మ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా ఆదివారం గురువైభవం అనే అంశంపై ప్రసంగించారు. గురువు ఎల్లప్పుడూ సాధన చేస్తూ ఆచరిస్తూ శిష్యులకు జ్ఞానాన్ని అందిస్తుంటారని చెప్పారు. పూర్వ జన్మల పాప కర్మలు గురువు అనుగ్రహంతోనే నశిస్తాయని తెలిపారు.

బాబు ష్యూరిటీ..

భవిష్యత్‌కు నో గ్యారెంటీ..!

- అమలు కాని సూపర్ సిక్స్ పథకాలు
- ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నిస్తున్న ప్రజలు
- సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్న అర్హులు
- కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ



పోలాకి మండలం గుప్పడిపేటలో బాండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయింది. 'మొదటి అడుగు' అని సంబరాలు చేసుకుంటోంది. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సూపర్-6 పథకాలను అమలు చేస్తామని చెప్పి ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ అని చెప్పి బాండ్లు పంపిణీ చేశారు. ఏడాది పాలనలో ఆ పథకాలను అమలు చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ 2019 ఎన్నికల ముందు నవరత్నాల పేరుతో పథకాలు అందిస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తరువాత ఆ పథకాలు అమలుకు చిత్తశుద్ధితో పనిచేసింది. ఇచ్చిన హామీలు నూరు శాతం అమలు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. సూపర్-6 పథకాలు కూడా నవరత్నాల వలే అమలు అవుతాయని నరసన్నపేట నియోజకవర్గ ప్రజలు ఎంతగానో ఆశించారు. ఈ పథకాలు ఆశించిన స్థాయిలో అమలుకాకపోవడంతో కూటమి ప్రభుత్వ మోసంపై మండిపడుతున్నారు.

అమలుకు నోచుకోని సూపర్ సిక్స్..

సూపర్-6లో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అని ప్రకటించారు. స్కూల్‌కు వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ఏటా ఇస్తామన్నారు. ప్రతి రైతుకీ ఏటా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ చెల్లిస్తామన్నారు. ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. ఈ పథకాల్లో రెండు అమలు చేసినా.. అవికూడా ఇచ్చిన హామీ ప్రకారం చేయలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మిగిలిన పథకాలు అమలు అదిగో, ఇదుగో అంటున్నారే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. మరో వైపు కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధం అవుతుంది.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



ఈ ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇన్నారు. దీని ప్రకారం మొదటి ఏడాదిలో 4 లక్షల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఏడాది పూర్తయింది. ఒక్కరికైనా ఇచ్చారా.. ఇంకెప్పుడు ఇస్తారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలి.

– బుద్ద రాజశేఖర్, ఇందిరానగర్, నరసన్నపేట

మహిళలకు తీవ్ర మోసం



ఎన్నికల ముందు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వస్తున్న ప్రతి పండగకూ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటిస్తూ వచ్చారు. ఏడాది గడిచిపోయింది. ఈ పథకం అమలు చేయలేదు. ఇప్పుడు ఆగస్టు 15వ తేదీ అంటున్నారు. ఇలా కాలయాపన చేయడం తగదు. ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు వెంటనే ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి.

– జి.వి.రమణి, జోనంకి సర్పంచ్, జలుమూరు మండలం

పెట్టుబడి సాయం ఎప్పుడు వేస్తారు?



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఏటా రైతులకు అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించింది. మొదటి ఏడాది ఎగ్గొట్టారు. ఇప్పుడు అదిగో, అదిగో అంటున్నారు. ఇంకెప్పుడు ఇస్తారు. ఈ విధంగా రైతులను మోసం చేయడం తగదు. రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ప్రకటించాలి.

– కనలవ శేఖరరావు, పోతయ్యవలస, నరసన్నపేట

కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తాం



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిన మోసాలను, సూపర్-6 పథకాలు ఎలా ఎగ్గొట్టిందో ప్రజలకు వివరిస్తాం. వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపుమేరకు నరసన్నపేట నియోజకవర్గంలో వాడవాడాలా తిరుగుతాం. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొనాలి.

– ధర్మాన కృష్ణచైతన్య, పోలాకి జెడ్పీటీసీ

జనం చెంతకు జగన్నాథుడు..

జగన్నాథ స్వామి రథోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారు గుండిచా మందిరంలో రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆదివారం కూర్మ, వరాహ అవతారంలో పూజలు అందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: అవలింగిలో కూర్మావతారంలో జగన్నాథ స్వామి



హిరమండలం: ఎల్.ఎన్.పేటలో వరాహ అవతారంలో జగన్నాథుడు



ఆమదాలవలస: లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఆవరణలో కూర్మావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు



హిరమండలం: హిరమండలంలో వరాహ అవతారంలో జగన్నాథ స్వామి



పాతపట్నం: బ్రాహ్మణవీధిలోని మందిరంలో కూర్మావతారంలో జగన్నాథుడు

గురుపూజోత్సవం..

నరసన్నపేట: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జ్ఞానజ్యోతీ డిగ్రీ కళాశాల ఆవరణలో గురుపూజోత్సవం నిర్వహించారు. విజయనగరం జిల్లాకు చెందిన విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ కాళ్ల శివప్రసాద్, బంగారు వర్తక సంఘం జాయింట్ కార్యదర్శి రంగనాథ్, అంధవరపు పద్మరాజు, తదితరులు హాజరై ప్రసంగించారు. హిందూ సంస్కృతిలో గురువుకు విశేష ప్రాధాన్యం ఉందన్నారు. గురువును సాక్షాత్తు భగవత్ స్వరూపంగా భావిస్తామన్నారు. ఆషాఢ మాస పౌర్ణమి రోజుల్లో సనాతన గురుపరంపరను గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతీ ఆషాఢ మాసంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నృత్య పోటీల్లో శ్రేయ మిశ్రో ప్రతిభ



మెడల్, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న శ్రేయ మిశ్రో

పాతపట్నం: జై జవాన్-జై కిసాన్-జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో అన్నమయ్య సంగీత నృత్యోత్సవం-2025 కార్యక్రమం ఇటీవల నిర్వహించారు. ఈ నృత్య పోటీల్లో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయ మిశ్రో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మహిషాసుర మర్దిని, పల్లెంపై నృత్యం (ప్లేట్ డాన్స్), కూచిపూడి నృత్యం చేసి ప్రశంసలు అందుకుంది. మిశ్రోకు డివోషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పత్రం, సర్టిఫికెట్, మెడల్‌ను నిర్వాహకులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు. శ్రేయ మిశ్రోకు అవార్డులు రావడం పై పాతపట్నం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బిల్లులు చెల్లించరూ..



కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టినా తమకు బిల్లులు మంజూరు కాలేదని సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస పంచాయతీ బక్కిరిపేట గిరిజనులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు చెప్పినట్లే దశల వారీగా ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇంతవరకు తమ ఖాతాలకు పైసా కూడా జమకాలేదని లబ్ధిదారులు సవర వినోత్, విస్తారాణి, చిన్నారావు, మయాతి, జెనియా, మార్తా, వినోష్, మేరి, రత్నాలు, మౌనిక వాపోయారు. అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేశామని, బ్యాంకులకు వెళ్లిచూస్తే పైసా కూడా జమ కాలేదన్నారు. అధికారులు స్పందించి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

– సరుబుజ్జిలి

ఎప్పుడు కూలుతుందో..!



సరుబుజ్జిలి మండలంలోని రావివలస గ్రామం రచ్చబండ వద్ద గల విద్యుత్ స్తంభం పూర్తిగా పక్కకు ఒరిగిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితులున్నాయి. ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సర్పంచ్ వండాన కృష్ణ ఆరోపించారు. ఈ రహదారిలో పొలాలకు వెళ్లే రైతులు, వాహనదారులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రూ.5 లక్షలు వృథా..!



సారవకోట మండలంలోని జాతీయ రహదారి 326'ఎ'కు ఆనుకుని బురుజువాడ గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్ ప్లెక్సీలు కట్టుకోడానికి ఉపయోగపడింది. టీడీపీ ప్రభుత్వ (2014-19) హయాంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు బురుజువాడను దత్తత తీసుకున్నారు. ఈ గ్రామానికి ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసి బస్ షెల్టర్‌ను నిర్మించారు. షెల్టర్ నిర్మాణం అనుకూలంగా లేకపోవడంతో దీనిని ప్రయాణికులు వినియోగించడం లేదు. ఈ షెల్టర్ వివిధ రాజకీయ పార్టీ నాయకుల ప్లెక్సీలు, ఇతర హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకోడానికి వినియోగిస్తున్నారు.

– సారవకోట

నిరుపయోగం



దుమ్ము, ధూళిలో సీహెచ్‌సీ బయట ఉన్న ఖాళీ సిలిండర్లు

- మరమ్మతులకు గురైన ఆక్సిజన్ ప్లాంట్
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పాతపట్నం: పాతపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. గత ప్రభుత్వం హయాంలో కరోనా రోగుల కోసం ప్లాంట్‌ను బిగించారు. వారి కోసం ప్రత్యేకంగా డీఆర్‌డీఏను తయారు చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఎంతో మంది కరోనా రోగులకు ప్రాణవాయువు అందింది. ఈ ప్లాంట్‌లోనే ఆక్సిజన్‌ను తయారు చేసి రోగులకు అందించారు. కరోనా అనంతరం ప్లాంట్ గురించి ఆస్పత్రి వర్గాలు, కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. పని చేస్తున్న ఆక్సిజన్ ప్లాంట్‌ను పట్టించుకోలేదా, లేక మరమ్మతులకు గురై ఉంటే వదిలిపెట్టారో తెలియడం లేదు. ఈ ప్లాంట్ మూతపడటంతో లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయి. ప్లాంట్‌ను పట్టించుకోకపోవడంతో సిలిండర్లు, పరికరాలు దుమ్ముపట్టాయి. మళ్లీ కరోనా వంటి విపత్కర పరిస్థితి వస్తే.. ఊహించుకుంటేనే భయమేస్తోంది.



పాతపట్నం సీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

ఆక్సిజన్ సిలిండర్ల కొనుగోలు..

రోగుల సౌకర్యార్థం పేరుతో వేలకు వేలు ఖర్చు చేసి ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేసి ఆస్పత్రికి పంపుతున్నారు. కేవలం కమిషన్ల కోసమే ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాతపట్నం మండలం జిల్లా సరిహద్దు ప్రాంతం. ఇక్కడ గిరిజన ప్రజలు ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఆక్సిజన్ ప్లాంట్‌ను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్లాంట్ బాగైతే రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది. అంతవరకు రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు ఎదురుచూస్తున్నాం. ఆదేశాలు రాగానే ప్లాంట్‌ను బాగు చేస్తాం.

– డాక్టర్ జి.వేణుగోపాల్, సూపరింటెండెంట్, పాతపట్నం సీహెచ్‌సీ

డంపింగ్ యార్డులా సాగునీటి కాలువ



దేశవానిపేట సమీపంలో కిల్లాం ఛానల్ మదుము వద్ద వేసిన చెత్త

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో సాగునీటి కాలువలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. చెత్తను స్థానికులు కాలువల్లో వేస్తున్నారు. దీని వలన సాగునీటి సమస్య ఉత్పన్నం అవుతుంది. చెత్తతో కాలువలు నిండుతున్నాయి. దీనికి నిదర్శనమే కిల్లాం చానల్. దేశవానిపేట దాటిన తరువాత పోలాకి రోడ్డుకు ఆనుకొని ఉన్న కిల్లాం ఛానల్ మదుము వద్ద చెత్త కుప్పగా వేశారు. దీనిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.